క్లుప్తంగా

శివస్వాముల భిక్షాటన


భిక్షాటన చేస్తున్న స్వాములు

పాయకరావుపేట: కార్తీక మాసం మూడవ సోమవారం శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి శివాలయంలో భారీ అన్నదానం చేసేందుకు కుమారపురం, రాజగోపాలపురం, కందిపూడి గ్రామాల శివస్వాములు ఆయా గ్రామాల పురవీధుల్లో శివనామస్మరణ చేస్తూ భిక్షాటన చేశారు. ఈ కార్యక్రమంలో పురోహితులు శివవంకర్ శర్మ, నీలాపు బాలకృష్ణారెడ్డి, అప్పలరెడ్డి, రావాడ గోవిందరెడ్డి, చుక్క బాలగోపాల రెడ్డి, గిన్ని దుర్గా రెడ్డి, శివ స్వాములు, శివమాలధారణ మాతలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దైవచింతన అలవరచుకోవాలి


వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న అతిథులు

మునగపాక: ప్రతి ఒక్కరూ దైవచింతన ఆలవరుచుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాకలోని శ్రీ సీతా రాముల దేవస్థానంలో రాముల వారికి సొంత నిధులు రూ.25 వేలతో తయారు చేసిన మకర తోరణాన్ని శనివారం ప్రారంభించారు. దేవాలయాలకు వెళ్లడం ద్వారా మనస్సు ప్రశాంతంగా, ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ప్రసాద్ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఆడారి సూర్య చంద్రరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఆడారి రమణబాబు, పెంటకోట వెంకట్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యేతర అంశాలపై మెలకువలు


తాము గీసిన బొమ్మలతో విద్యార్థులు

అచ్యుతాపురం: విద్యార్థులకు మూడవ శనివారాన్ని పురస్కరించుకొని పాఠ్యేతర అంశాలపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు. సృజన కార్యక్రమంలో భాగంగా మండలంలోని వాడపాలెం ఎలిమెంటరీ పాఠశాలలో విద్యార్థులకు అభినయ గేయాలు, బొమ్మలు గీయడం, బంక మట్టితో నమూనా బొమ్మలు వేయడం, మాస్కులు తయారు చేయడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వి. ఎస్తేరు రాణి, ఉపాధ్యాయురాలు నూకలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల అనుపు మహోత్సవం


గౌరీ పరమేశ్వరులకు పూజలు చేస్తున్న భక్తులు

రాంబిల్లి (యలమంచిలి): మండలంలో కట్టుబోలు గ్రామంలో శనివారం గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవం ఘనంగా జరిగింది. గౌరీపరమేశ్వరుల విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు గౌరీపరమేశ్వరులకు సారె కావెడలు సమర్పించారు. గ్రామంలో గౌరీ పరమేశ్వరుల జాతర సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కోయ డ్యాన్స్ విశేషంగా భక్తులను అలరించింది. భక్తులు గౌరీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేసి అనుపు మహోత్సవాన్ని ఘనంగా జరిపించారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం

యలమంచిలి రూరల్: పట్టణంలోని కామాక్షి అమ్మవారి ఆలయంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కార్తీకమాస ఆరాధనోత్సవాల్లో భాగంగా శనివారం గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం పెద్దలు, దంపతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కల్యాణ క్రతువు ముగిసిన తర్వాత భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. సాయంత్రం స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. ఆరాధనోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకుడు టేకి సోమశేఖరాచార్యులు, కల్యాణి దంపతులు, ఆలయ కమిటీ పెద్ద సున్నం నాగు, భక్తులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7331100207, 7997958344

వారోత్సవాల్లో విజ్ఞానం.. వినోదం



చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయం

గ్రంథాలయ వారోత్సవాలకు విశేష స్పందన లభిస్తోంది. విద్యార్థులకు విజ్ఞానంతో పాటు వినోదం కూడా అందించడంతో ప్రతిరోజు విద్యార్థులు, పాఠకులు తరలి వస్తున్నారు. మండలంలో చినదొడ్డిగల్లు, నక్కపల్లి శాఖా గ్రంథాలయాల్లో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో ప్రతిరోజు సగటున 40 మందికి పైగా విద్యార్థులు, పాఠకులు వస్తున్నారు. మండల కేంద్రం నక్కపల్లిలో ఉన్న శాఖా గ్రంథాలయానికి నిత్యం 70 మందికి పైగా విద్యార్థులు, పాఠకులు వస్తుంటారు.

- గ్రంథాలయాలకు విశేష స్పందన
- తరలి వస్తున్న విద్యార్థులు, పాఠకులు
- తెలుగు, ఇంగ్లిమ్‌పై పట్టు సాధించే కార్యక్రమాలు



చినదొడ్డిగల్లులో విద్యార్థులతో పుస్తక పఠనం చేయిస్తున్న దృశ్యం

నక్కపల్లి: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పద్యపఠనం, స్పోకెన్ ఇంగ్లీషు, ఆటల పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నారు. తెలుగు ఉపాధ్యాయుడు ఎన్‌వీఎస్ ఆచార్యులు తీరిక సమయంలో ఈ గ్రంథాలయాలకు వెళ్లి విద్యార్థులకు పద్య పఠనం, చందమామ కథలు, చందస్సు నేర్పించడం, తెలుగు భాషపై పట్టు సాధించేందుకు వీలుగా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నారు. వారోత్సవాల్లోనే కాకుండా వేసవిలోను, పాఠశాలలకు సెలవు దినాల్లో కూడా చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. వారోత్సవాల్లో ప్రత్యేకంగా స్పోకెన్ ఇంగ్లీషుపై శిక్షణ ఇప్పించడంతో తమకెంతో ఉపయుక్తంగా ఉంటోందని విద్యార్థులు చెబుతున్నారు. సివిల్స్, పబ్లిక్ సరీ్వస్ పరీక్షలు, ఎంసెట్, నీట్, బ్యాంకు తదితర పోటీ పరీక్షలకు అవసరమయ్యే అన్ని రకాల పుస్తకాలు, మేగజైన్లు అందుబాటులో ఉంచుతున్నారు. ఇవి కాకుండా వారం రోజుల పాటు నిత్యం ఏదో ఒక అంశంపై పోటీలు నిర్వహించి ముగింపు రోజున బహుమతులు ప్రదానం చేసే ఏర్పాట్లు కూడా చేపట్టారు. శిథిలావస్థకు చేరిన గ్రంథాలయానికి గత ప్రభుత్వంలో నిధులు మంజూరు చేయించి నూతన భవనాన్ని నిర్మించిన ఘనత గ్రంథాలయాధికారి జనార్దన్‌కే దక్కుతుంది.

మంచి ఆదరణ లభిస్తోంది..


గ్రంథాలయ వారోత్సవాలకు పాఠకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. అన్ని తరగతుల వారికి అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. విజ్ఞానంతో పాటు వినోదం అందించే కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. తెలుగు, ఇంగ్లీషు భాషలపై పట్టు సాధించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– కె. జనార్దన్, గ్రంథాలయ అధికారి, చినదొడ్డిగల్లు

పఠనాసక్తి పెంపొందించడమే ధ్యేయం..


సెలవు రోజుల్లో సిబ్బంది కోరిక మేరకు గ్రంథాలయాలకు వెళ్లి పద్య పఠనం, చందమామ కథలు, నీతి కథలు, వ్యాకరణం వంటి విషయాలు బోధిస్తున్నాను. పఠన నైపుణ్యం పెంపొందించడమే ప్రధాన ఉద్దేశ్యంగా శిక్షణ ఇస్తున్నాం. వారోత్సవాలకు విశేష స్పందన వస్తోంది.

– ఎన్‌వీఎస్ ఆచార్యులు, తెలుగు ఉపాధ్యాయుడు

మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు..


వారోత్సవాల్లోనే కాకుండా సెలవు రోజుల్లో కూడా గ్రంథాలయంలో విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మా పిల్లలకు ఇంగ్లీషు, తెలుగు సబ్జెక్టులపై పట్టు సాధించే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం. గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

– అమ్మాజీ, పేరెంట్, చినదొడ్డిగల్లు

నాలెడ్జి పెంచుకుంటున్నాం..


గ్రంథాలయంలో ఉపయోగపడే ఎన్నో పుస్తకాలు అందుబాటులో ఉంచారు. వారోత్సవాల్లో మాలో మాకు పోటీ తత్వాన్ని పెంచే విజ్ఞానం, వినోదానికి సంబంధించిన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాఠశాల ముగిసిన తర్వాత గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు చదువుకుంటూ నాలెడ్జ్ పెంచుకుంటున్నాం.

– వై. నవీన్, విద్యార్థి, చినదొడ్డిగల్లు

21న నాగులాపల్లిలో శూలాల మహోత్సవం


నాగులాపల్లిలోని శివలింగం

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో ఈనెల 21న పార్వతీ సాంబమూర్తుల శూలాల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్, కార్యదర్శులు మూరా రామేశ్వరరావు, ఆంధ్ర మల్లేశ్వరరావు సంయుక్తంగా తెలిపారు. ఏటా కార్తీకమాసంలోని మూడవ సోమవారం శూలాల మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీ అని తెలిపారు.

పద్య పఠన పోటీల్లో పెదబోదిగల్లం విద్యార్థి సత్తా


కౌసర్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

నక్కపల్లి: ఈ నెల 14న బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నర్సీపట్నంలో నిర్వహించిన జిల్లాస్థాయి బాలల విజ్ఞాన పోటీల్లో పద్యపఠన విభాగంలో ఎనిమిదో తరగతి చదువుతున్న పెదబోదిగల్లం విద్యార్థి జెరీనా కౌసర్‌కు ప్రథమ స్థానం లభించినట్లు తెలుగు ఉపాధ్యాయుడు ఎన్‌వీఎస్ ఆచార్యులు తెలిపారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం, మెమెంటో అందజేశారన్నారు. విజేతగా నిలిచిన కౌసర్‌ను గ్రామస్తులు అభినందించారు. హెచ్‌ఎం చోడిశెట్టి సత్యనారాయణ, సర్పంచ్ మున్నీషా, ఉపాధ్యాయులు ఫల్గుణరావు, కుమారి, శ్రీదేవి, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో చక్కటి విజ్ఞానం


గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులు అర్పిస్తున్న నాయకులు


కోటవురట్లలో గ్రంథాలయ పితామహులకు నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠన ప్రాధాన్యతను తెలుపుతున్న విద్యార్థులు

పాయకరావుపేట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ ఉద్యమకారులు పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూషణం, గాడిచర్లకు నివాళులర్పించారు. ఎంపీపీ ఇసరపు పార్వతీ, వైస్ ఎంపీపీ ధనిశెట్టి మాధవి, జెడ్పీటీసీ సభ్యుడు లంక సూర్యనారాయణ, గ్రామ పంచాయతీ వైస్ సర్పంచ్ జగతా శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి బాబి, కేశనకుర్తి సత్తిబాబు, ధనిశెట్టి తులసి రామ్ హాజరై ఉద్యమకారులకు నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు పద్య పఠన పోటీలు ఏర్పాటు చేశారు. అతిథులు మాట్లాడుతూ విద్యార్థులంతా గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని, చక్కటి జ్ఞానం పొందాలని అన్నారు.

కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో..

కోటవురట్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో మూడోరోజు జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో గ్రంథాలయ పితామహులకు ఘన నివాళి అర్పించారు. అనంతరం నిర్వహించిన చిత్రలేఖనం పోటీలో 55 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమలోని ప్రతిభను చూపారు. ఈ కార్యక్రమంలో డ్రాయింగ్ టీచర్ ఈశ్వరరావు, ఉపాధ్యాయులు సుధారాణి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో..

అచ్యుతాపురం: విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని ఉపాధ్యాయుడు మారిసెట్టి వెంకట అప్పారావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఆయన అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. మహానుభావుల చరిత్రలను చదవాలని అప్పారావు మాస్టారు విద్యార్థులకు ఉద్బోధించారు. గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు, లాలం ప్రసాద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మునగపాక, గణపర్తి గ్రంథాలయాల్లో..

మునగపాక: మునగపాక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహులు అయ్యంకి వెంకటరమణయ్య, హరి సర్వోత్తమరావు, నాగభూషణం, డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్‌కు పలువురు నివాళులు అర్పించారు. గ్రంథాలయాధికారి రమణ, పాఠకులు పాల్గొన్నారు. అలాగే గణపర్తి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని గ్రంథాలయ నిర్వహణ అధికారి అప్పలనరసమ్మ తెలిపారు.


గణపర్తిలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం


మునగపాకలో గ్రంథాలయ ఉద్యమ నేతల చిత్రపటాల వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

దిమిలి శాఖా గ్రంథాలయంలో..

రాంబిల్లి (యలమంచిలి): మండలంలో దిమిలి శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులు ఆలపించిన దేశభక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. అంతకు ముందు గ్రంథాలయాల అభ్యున్నతికి తోడ్పడిన దేశనాయకులు, వక్తలు, సంఘ సంస్కర్తల చిత్ర పటాలకు విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి శకుంతల తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి శాఖా గ్రంథాలయంలో..

యలమంచిలి రూరల్: శనివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ పితామహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య, ఎస్ఆర్ రంగరాజన్, పాతూరి నాగభూషణంలకు పలువురు నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి వి. ఆనంద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో పాఠకులు తదితరులు పాల్గొన్నారు.


దిమిలి గ్రంథాలయంలో సంఘ సంస్కర్తలకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు


యలమంచిలి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ కారులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ధర్నా

అనకాపల్లి: ఆటో మోటార్ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటోమోటర్ యూనియన్ (ఏఐటీయూసీ) పట్టణ గౌరవాధ్యక్షుడు వై.ఎస్.భద్రం డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీవో కార్యాలయం వద్ద యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికుల బతుకులు దినదిన గండంలా మరిపోయాయని, పెరిగిన డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్ ధరలను నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలమైనట్లు ఆయన పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో వాహన మిత్ర పథకం కింద పది వేలు అందజేశారని, చంద్రబాబు ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే ఆటో కార్మికుల సంక్షేమ కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చి నేడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ఆటో డ్రైవర్లకు హాని చేసే జీవోలు, పెండింగ్‌లో ఉన్న ఈ–చలానాలు రద్దు చేసి కేసులు ఎత్తివేయాలని, భారీగా పెంచిన రోడ్డు ట్యాక్స్ తగ్గించాలనే డిమాండ్లతో ఆర్టీవో కార్యాలయంలో ఏవోకు వినతిప్రతం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేయాలి

అనకాపల్లి: అనకాపల్లి–అచ్యుతాపురం రహదారి విస్తరణలో ఇళ్లు, భూములు కోల్పోయిన బాధితుల సమస్యలు పరిష్కరించాలని, మునగపాక నుంచి అనకాపల్లి బైపాస్ వరకు 100 అడుగుల రోడ్డు విస్తరణలో నష్టపోయిన బాధితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందించాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. రామ సదాశివరావు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో షేక్ అయిషాకు వినతిపత్రం అందజేశారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం ప్యాకేజీ ఇవ్వాలని, రోడ్డుకు ఇరువైపుల ఏళ్ల తరబడి చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్న వారికి నష్టపరిహారం అందజేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కర్రి అప్పారావు, సీఐటీయూ మునగపాక కార్యదర్శి కె.బ్రహ్మాజీ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ బాధితులకు మెరుగైన పరిహారం ఇవ్వాల్సిందే

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణలో మెరుగైన పరిహారం అందించాలని మునగపాకకు చెందిన పలువురు బాధితులు శనివారం నిర్వహించిన సమావేశంలో ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న 14 కిలోమీటర్ల రహదారిని విస్తరించే క్రమంలో మునగపాక రెవెన్యూ పరిధిలో బాధితులకు ప్రభుత్వం ఇస్తామన్న పరిహారం ఎటూ చాలదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మునగపాక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో శనివారం బాధితులంతా సమావేశమయ్యారు.

రెండేళ్ల క్రితం నిర్ణయించిన ధర నేడు ఎటూ చాలదని ప్రభుత్వం మరోసారి ఆలోచించి మెరుగైన పరిహారం అందించాలని తీర్మానం చేశారు. ఇందుకు ప్రభుత్వం సమ్మతించకుంటే న్యాయ పోరాటానికి సిద్ధం కావాలని ముక్తకంఠంతో ప్రకటించారు. సమావేశంలో బాధితులు పెంటకోట స్వామి సత్యనారాయణ, ఆడారి అప్పలనాయుడు, సూరిశెట్టి కన్నారావు, పెంటకోట జగన్నాథరావు మాస్టారు, పెంటకోట అజయ్, పొలిమేర కృష్ణ, నాయుడప్ప, సింధు మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE AT VISAKHAPATNAM
GWOP 16/2024

Between:
Vempali Sesha Chandra Mouli,
S/o. Vempali Chandra Sekhar,
R/o. Door No. 37-12-54/4, N.G.G.O.S. Colony,
behind Polytechnic College, Kapparada,
Visakhapatnam, Andhra Pradesh -530007
..... Petitioner

And:
Vempali (Velaga) Lakshmi Manasa,
W/o. Vempali Sesha Chandra Mouli,
D/o. Velaga Kondala Rao, R/o. Karri Vaari Veedhi,
Near Gurajada Junction, S.Rayavaram Village,
Anakapalli District, Andhra Pradesh - 531060.
..... Respondent

GENERAL PUBLIC NOTICE

ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా శ్రీ వెంపలి శేష చంద్రమౌళి, S/o. చంద్రశేఖర్, డోర్ నెం. 37-12-54/4, N.G.G.O.S. Colony, పాలిటెక్నిక్ కాలేజీ వెనుకాల, కప్పరాడ, విశాఖపట్నం వారు పైన తెలిపిన వ్యాజ్యములో తన మైనర్ కుమారుడు చి॥ వెంపలి దేవాన్ష్ వివాన్‌కు గార్డియనుగా నియమించుటకు, సదరు మైనర్ బాలుడి పరిరక్షణ, కస్టడీ కొరకు మరియు మైనర్ బాలుడిని పరామర్శించుటకు కోర్టు ద్వారా ఆర్డర్ పొందుటకై పై వ్యాజ్యము దాఖలు చేసినారు. కావున సదరు వ్యాజ్యములో పైన తెలిపిన ప్రతివాదికి గాని, వ్యక్తులకు గాని, సంస్థలకు గాని ఎటువంటి అభ్యంతరములు ఉన్న యెడల పై తెలిపిన కోర్టులో ది: 27-11-2024న ఉదయం 10.30 గం॥కు వ్యక్తిగతంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయి మీ యొక్క అభ్యంతరములు తెలియజేయవలెను. లేని యెడల చట్టప్రకారం వ్యాజ్యమును పరిష్కరించబడును.

M.V. RAJESH, Advocate
Visakhapatnam. Cell: 99666 00818

ఉచిత విద్యుత్‌కు ఎసరు పెట్టేందుకే స్మార్ట్‌మీటర్లు



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నక్కపల్లి: ప్రస్తుతం వ్యవసాయ రంగానికి ఇచ్చే ఉచిత విద్యుత్‌కు ఎసరు పెట్టేందుకే కూటమి ప్రభుత్వం ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను రంగంలోకి దించిందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం. అప్పలరాజు, సీఐటీయూ నాయకులు విమర్శించారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రైతులు, వినియోగదారులకు ఉరితాళ్లుగా మారనున్న ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు అమర్చడాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రీపెయిడ్ మీటర్ల వల్ల ప్రజలపై ఆర్థిక భారం పెరుగుతుందన్నారు. ఈ మీటర్లను ముందుగానే రీచార్జి చేసుకోవాలన్నారు. బ్యాలెన్స్ అయిపోయిన వెంటనే అర్ధంతరంగా విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. ప్రతి మీటరుకు అయ్యే ఖర్చును 96 నెలల పాటు వినియోగదారుల నుంచే వసూలు చేయడానికి కూటమి ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు సత్యనారాయణ, మండల కన్వీనర్ మనబాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంతో గ్రామాల అభివృద్ధి

మునగపాక: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో అభివృద్ధికి అవకాశం ఉంటుందని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి తెలిపారు. తోటాడ పంచాయతీ గవర్ల అనకాపల్లిలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఆమె కూటమి నేతలతో కలిసి భూమి పూజ చేశారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించుకునేందుకు అవకాశం కలిగిందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీ లక్ష్మి, పెద్దలు దొడ్డి కోటేశ్వరరావు, పాలమరశెట్టి మురళి, చదరం భాస్కరరావు, నరేంద్ర, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు

యలమంచిలి రూరల్: మున్సిపాలిటీ పరిధి సోమలింగపాలెంలో గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు శనివారం రాత్రి ఘనంగా జరిగింది. మహిళలు తయారు చేసిన వివిధ రకాల పిండి వంటలు, పండ్లతో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ప్రత్యేక పూజల అనంతరం వాటిని అందరికీ పంచిపెట్టారు. యల్లపు గోపి, యల్లపు శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


నెహ్రూనగర్‌లో తుప్పలు తొలగిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, సిబ్బంది

యలమంచిలి రూరల్: పట్టణ ప్రజలు తమ నివాసాలతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు సూచించారు. పట్టణంలోని నెహ్రూనగర్‌లో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన మున్సిపల్ సిబ్బందితో కలిసి చెత్త, వ్యర్థాల తొలగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టరు ఆదేశాల మేరకు ప్రతి శనివారం పట్టణంలో ఒక ప్రాంతంలో వ్యర్థాలు, చెత్త తొలగింపు చేపడుతున్నామన్నారు. పట్టణం పరిశుభ్రంగా ఉండాలంటే ప్రజలంతా సహకరించాలని, ఈ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాయకరావుపేట డివిజన్:
9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com